RNI. No. TELTEL/2023/87656

# దీక్ష సాక్షి

తెలుగు దినపత్రిక

సంపుటి : 2 । సంచిక : 5 హైదరాబాద్ తిరుపతి, కడప, అన్నమయ్య4-8-2026 మంగళవారం పేజీలు : 4 । వెల : రూ.1/-

Published From thirupathi, :Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari,West Godavari,Krishna,Guntur,Prakasam,Nellore,Chittoor,Kurnool,Anantapuram,Hyderabad

## డ్యాంలో 92 టీఎంసీల వరద చేరిక

- నేడు వంద దాటుతుందన్న అంచనా
- రాత్రికి 1.55 లక్షల క్యూసెక్కుల రాక
- జూరాల నుంచి 2.21 లక్షల క్యూసెక్కులు
- ఆలమట్టి నుంచి కొనసాగుతున్న వరద



**శ్రీశైలం/దీక్ష సాక్షి న్యూస్**

శ్రీశైలం జలాశయంలో నీటినిల్వలు వేగంగా పెరుగుతున్నాయి. ఐదు రోజుల కిందట ప్రవాహం మొదలై 820 అడుగుల నుంచి పెరుగుతూ వస్తున్న కృష్ణమ్మ.. సోమవారం సాయంత్రానికి 855.10 అడుగులకు చేరింది. ప్రస్తుతం 92.048 టీఎంసీల నీరుంది. మంగళవారం సాయంత్రానికి వంద టీఎంసీలకు చేరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. సోమవారం జూరాల ప్రాజెక్టు నుంచి 2.21 లక్షల క్యూసెక్కులు శ్రీశైలానికి విడుదల చేశారు. రాత్రి సమయానికి శ్రీశైలానికి 1.55 లక్షల క్యూసెక్కులు వచ్చి చేరింది.

### హెచ్-1బీ వీసా రెన్యువల్‌పైనా అదనపు ఫీజులు.. .

## అమెరికా కొత్త ప్రతిపాదన



: వలసలపై ఉక్కుపాదం మోపుతున్న ట్రంప్ సర్కారు మరో వీసా ఫీజును తెరపైకి తెచ్చింది. బడా కార్పొరేషన్ల హెచ్-1బీ, ఎల్-1 పిటిషన్ల రెన్యువల్స్‌పై అదనపు ఫీజు విధించేలా ప్రతిపాదనలను సిద్ధం చేస్తుంది. ఈ దిశగా 9-11 రెస్పాన్స్ అండ్ బయోమెట్రిక్ ఎంట్రీ-ఎగ్జిట్ ఫీజును వీసా రెన్యూవల్స్‌కు వర్తించేలా రూపొందించిన నిబంధనలు తుది రూల్ మేకింగ్ దశకు చేరుకున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇది అమల్లోకి వస్తే కంపెనీలకు హెచ్-1బీ వీసాదారులను కొనసాగించడం మరింత భారంగా మారుతుందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.సగానికి పైగా హెచ్-1బీ వీసాదారులు, ఎల్-1వీ వీసాదారులు ఉన్న అమెరికన్ కంపెనీలపై ఈ అదనపు ఫీజును విధించేందుకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ, కార్మిక శాఖ, విదేశాంగ శాఖ కసరత్తు చేస్తున్నాయి. ప్రస్తుతం ఇలాంటి బడా సంస్థలు కొత్త విదేశీ వర్కర్లను స్పాన్సర్ చేసే సమయంలో హెచ్-1బీ, ఎల్-1 పిటిషన్లపై అదనంగా 4 వేల డాలర్ల ఫీజును చెల్లిస్తున్నాయి. ఇకపై విదేశీ ఉద్యోగిని కొనసాగించేందుకు చేసే రెన్యూవల్స్ విషయంలోనూ ట్రంప్ సర్కారు అదనపు ఫీజు విధించే అవకాశం ఉంది.అమెరికా పౌరసత్వ, వలస సేవల శాఖ లెక్కల ప్రకారం, ప్రభుత్వం జారీ చేసే హెచ్-1బీ అనుమత్లో అధిక శాతం రెన్యువల్స్‌కు సంబంధించినవే. 2025 సెప్టెంబర్ 30తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో 4.06 లక్షల హెచ్-1బీ అప్లికేషన్లను ఆమోదించగా వాటిల్లో 71 శాతం రెన్యూవల్స్‌కు సంబంధించినవేనని తేలింది. కాబట్టి ఈ ఫీజు కూడా అమల్లోకి వస్తే భారతీయులపై మరింత భారం పెరిగే అవకాశం ఉందన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి.

## బీజేపీ కంచుకోట బద్దలు.

### బిహార్‌లోని బాంకీపూర్‌లో ప్రశాంత్ కిశోర్ విజయం



- 19,324 ఓట్ల మెజారిటీతో గెలుపు
- నితిన్ నబీన్ ఖాళీ చేసిన సీట్లో బీజేపీ ఓటమి
- మధ్యప్రదేశ్‌లో దాటియాను నిలబెట్టుకున్న కాంగ్రెస్
- గుజరాత్‌లోని మంజల్‌పూర్ మళ్లీ బీజేపీదే

**న్యూఢిల్లీ, దీక్ష సాక్షి న్యూస్**

జన్‌సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిషోర్ గెలుపు రుచి చూశారు. బీజేపీ కంచుకోటను బద్దలుకొట్టి.. ప్రజాప్రతినిధిగా తన రాజకీయ ప్రస్థానాన్ని ఘనంగా ఆరంభించారు. గతేడాది బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క స్థానంలోనూ గెలవలేకపోయిప్పటికీ.. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఖాళీ చేసిన బాంకీపూర్ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో, విజయంతో మంచి బోణీ కొట్టారు. నితిన్ నబీన్ కుటుంబానికి కంచుకోట అయిన స్థానాన్ని కైవసం చేసుకుని, బీహార్‌లో బీజేపీకి గట్టి సవాల్ విసిరారు. దీంతో బీజేపీ జాతీయ అధ్యక్ష బాధ్యతలను స్వీకరించిన తర్వాత ఎదురైన తొలి ఎన్నికల సమరంలో నితిన్ నబీన్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్టయింది. మరోవైపు గుజరాత్‌లోని మంజల్‌పూర్ స్థానాన్ని అధికార బీజేపీ నిలబెట్టుకోగా, మధ్యప్రదేశ్‌లోని దాటియా స్థానంలో ఓటర్లు కాంగట?గ్రకే పట్టం కట్టారు. మూడు రాష్ట్రాల్లోని మూడు అసెంబ్లీ స్థానాలకు నిర్వహించిన ఉప ఎన్నికల ఫలితాలను ఎన్నికల సంఘం (ఈసీ) సోమవారం విడుదల చేసింది..

## ఉరవకొండలో వైసీపీ హల్‌చల్

- అనుమతి లేకున్నా ధర్నాకు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి యత్నం
- అడ్డుకుని వాహనం ఎక్కించిన పోలీసులు
- అడ్డుకున్న వైసీపీ కార్యకర్తలు
- రోడ్డుకు అడ్డంగా ఆక్సిజన్ సిలిండర్లు, బండరాళ్లు
- ప్రజలపైకీ రాళ్లెత్తడంతో ఉద్రిక్తత
- విశ్వేశ్వరరెడ్డిని అదుపులోకి తీసుకుని వేరే చోటకు తరలింపు
- మాజీ ఎంపీ మాధవ్ కూడా అరెస్టు

**ఉరవకొండ దీక్ష సాక్షి న్యూస్**



అనంతపురం జిల్లా ఉరవకొండ పట్టణంలో వైసీపీ శ్రేణులు హంగామా సృష్టించాయి. రోడ్లకు అడ్డంగా ఆక్సిజన్ సిలెండర్లు, బండలు వేసి భయానక వాతావరణం సృష్టి ంచాయి. నియోజకవర్గం లో దౌర్జన్యాలు, భూఆక్ర మణలు పెరిగాయంటూ వైసీపీ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి సోమవారం ధర్నాకు పిలుపిచ్చారు. దీనికి పోటీగా టీడీపీ కూడా.. గత వైసీపీ హయాంలో బీసీలపై జరిగిన దాడులను నిరసిస్తూ మహాధర్నాకు సిద్ధమైంది. అయితే శాంతిభద్రతల దృష్ట్యా ఈ రెండు ధర్నాలకూ పోలీసులు అనుమతులు నిరాకరించారు. అయినా విశ్వేశ్వరరెడ్డి ఉరవకొండలోని వైసీపీ కార్యాలయానికి చేరుకున్నారు. ఆ పార్టీ నాయకులు ప్రత్యేక వాహనాల్లో గ్రామాల నుంచి కార్యకర్తలను ఉరవకొండకు తరలించారు. వారంతా రావడంతో.. ధర్నాకు అనుమతి లేదని.. వెళ్లిపోవాలని పోలీసులు స్పష్టంచేశారు. కానీ వారు పట్టించుకోలేదు. పైగా తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాకు విశ్వేశ్వరరెడ్డి వెళ్లేందుకు ప్రయత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. ఆయన్ను అదుపులోకి తీసుకుని, పోలీసు వాహనంలో ఎక్కించేందుకు యత్నించారు. వైసీపీ శ్రేణులు అడ్డుకున్నాయి. దీంతో పోలీసులు, కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. మాజీ ఎమ్మెల్యేను ఎట్టకేలకు వాహనంలో ఎక్కించగా.. వైసీపీ కార్యకర్తలు పేట్రేగిపోయారు. ఆక్సిజన్ సిలెండర్లను రోడ్డుకు అడ్డంగా వేశారు. బండలను కూడా అడ్డంగా ఉంచి.. నానాయాగీ చేశారు. రాళ్లను జనంపైకి కూడా ఎత్తడంతో వారు భయాందోళనలకు లోనయ్యారు. పరిస్థితి ఉద్రిక్తంగామారడంతో పోలీసులు విశ్వేశ్వరరెడ్డిని అరెస్టు చేసి వేరే ప్రాంతానికి తరలించారు. దీనిని నిరసిస్తూ వైసీపీ శ్రేణులు గుంతకల్లు-ఉరవకొండ ప్రధాన రహదారిపై ధర్నాకు దిగాయి. పోలీసులువారిని అక్కడి నుంచి పంపించివేయడంతోపరిస్థితి సద్దుమణిగింది. కాగా.. ధర్నాలో పాల్గొనేందుకు ఉరవకొండకు వచ్చి ఓ ఇంట్లో ఉన్న వైసీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌ను పోలీసులు ముందుగానే అదుపులోకి తీసుకున్నారు.

## 2.25 లక్షల కొత్త పింఛన్లు

**హైదరాబాద్, దీక్ష సాక్షి న్యూస్**

రాష్ట్రంలో అర్హులైన 2,25,599 మందికి కొత్తగా పింఛన్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు, చేనేత, గీత, బీడీ కార్మికులు, హెచ్ఐవీ-ఏఆర్‌టీ బాధితులు, ఫైలేరియా, డయాలసిస్ పేషెంట్లు, బీడీ తేకేదార్లకు పింఛన్లు అందుతున్నాయి. వారితోపాటు.. తలసీమియా, సికిల్ సెల్ ఎనీమియా బాధితులకు కూడా పింఛన్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. సీఎం ఆదేశాల నేపథ్యంలో అధికార యంత్రాంగం అర్హులను గుర్తించే పనిలో నిమగ్నమైంది. ఇటీవల నిర్వహించిన కుల గణన (సీపెక్ సర్వే), ఎస్‌హెచ్‌జీ మహిళా సంఘాల ద్వారా వచ్చిన వివరాలను పరిగణనలోకి తీసుకుని అర్హులైనవారికి కేటగిరీలవారీగా పింఛన్లు మంజూరు చేసేందుకు సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (సెర్ప్) అధికారులు చర్యలు చేపట్టారు. ఆగస్టు 15 నుంచి కొత్త పింఛన్ల దరఖాస్తుల స్వీకరణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అదే రోజు సీఎం రేవంత్‌రెడ్డి పింఛన్ల దరఖాస్తుల విషయాన్ని ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. కొత్తగా జాబితాలోకి వచ్చిన వారికి సెప్టెంబరు నుంచి పింఛన్ అందనుంది. వాస్తవానికి తలసీమియా, సికిల్ సెల్ ఎనీమియా వ్యాధులను ప్రభుత్వం 21 రకాల వ్యాధుల జాబితాలో చేర్చింది. దాంతో ఈ కేటగిరీలోని కొంతమందికి ఇప్పటికే పింఛన్‌లు అందుతున్నాయని అధికార వర్గాలు చెబుతున్నాయి. వారు కాకుండా తలసీమియా, సికిల్‌సెల్ ఎనిమియా వ్యాధి బాధితులు 1,599 మంది సెర్ప్‌లో నమోదై ఉన్నారని, వారితో పాటు మరికొంతమంది దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిసింది. ఇక.. కొత్తగా గుర్తించిన వితంతువులు 2,03,000 మంది ఉన్నట్టు అంచనా.అదే కోవలో చేనేత కార్మికులు 3 వేల





మంది, గీత కార్మికులు 4 వేల మంది, దివ్యాంగులు 1.22 లక్షలు, 65 ఏళ్లు పైబడిన వాళ్లు లక్ష మంది, 57-64 ఏళ్లవారు 4 లక్షల మంది ఉన్నారు. వీరిలో అర్హులు ఎంతమంది అన్న విషయాన్ని 360 డిగ్రీల సాఫ్ట్‌వేర్‌లో పరిశీలించనున్నారు. అన్ని కేటగిరీల్లో కలిపి మొదటి దఫాలో 2.25 లక్షల మందికి కొత్తగా పింఛన్ వచ్చే అవకాశాలున్నట్టు సమాచారం. ఇటీవల లైవ్ అథెంటికేషన్ ద్వారా కొన్ని పింఛన్‌లను తొలగించారు. వాటి స్థానంలోనూ మరికొన్ని కొత్త పింఛన్‌లు ఇచ్చే అవకాశం ఉందని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. కాగా.. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం 11 రకాల కేటగిరీల్లో 41,06,552 మందికి పింఛన్ ఇస్తోంది. వీరందరికీ కలిపి నెలకు (జూలైలో ఇచ్చిన పింఛన్ లెక్క ప్రకారం) రూ.922.17 కోట్లను అందిస్తోంది. అంటే ఏడాదికి దాదాపు రూ.11,066 కోట్లు. ఇప్పుడు కొత్తగా మంజూరు చేయనున్న పింఛన్లతో రాష్ట్ర ప్రభుత్వంపై ఏడాదికి దాదాపు రూ.500 కోట్ల వరకు అదనపు భారం పడే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు

- తలసీమియా, సికిల్ సెల్ ఎనీమియా బాధితులకూ మంజూరు
- ఇప్పటికే 1,599 మందిని గుర్తించి సర్టిఫికెట్లు ఇచ్చిన అధికారులు
- 15 నుంచి దరఖాస్తుల స్వీకరణ.. ఆ రోజు ప్రకటించనున్న సీఎం
- సెప్టెంబరు నుంచి మంజూరయ్యేలా యంత్రాంగం ఏర్పాట్లు
- కొత్త పింఛన్లతో సర్కారుపై ఏటా రూ.500 కోట్ల అధిక భారం
- ప్రస్తుతం ఏడాదికి పింఛన్ల ఖర్చు రూ.11,066 కోట్లు

## ఆక్సిజన్ ఏం చేస్తున్నారు..?

### కొనుగోళ్లు భారీగా ఎందుకు పెరిగాయి?

### ఆరోగ్య శాఖ సమీక్షలో మంత్రి సత్యకుమార్

**అమరావతి దీక్ష సాక్షి న్యూస్**

కొవిడ్- 19 నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రభుత్వాసుపత్రుల్లో ఆక్సిజన్ సరఫరా కోసం దాదాపు రూ. 105 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన పీఎస్‌ఏ (ప్రెసర్ స్వింగ్ అడ్సార్ప్షన్) ప్లాంట్లు నిరుపయోగంగా ఎందుకు మారాయని అధికారులను రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ప్రశ్నించారు. ఆసుపత్రుల్లో పీఎస్‌ఏ ప్లాంట్లు, అధిక మోతాదులో ఎల్ఎంవో (లిక్విడ్ మెడికల్ ఆక్సిజన్) కొనుగోళ్ల అంశాలపై సోమవారం మంగళగిరిలోని ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎల్ఎంవో కొనుగోళ్లకు సంబంధించి వాస్తవ డిమాండ్‌తో పాటు సరఫరాపై రెండు వారాల్లో సమగ్రంగా ఆడిట్ నిర్వహించాలని ఈ సందర్భంగా ఆదేశించారు. ఆక్సిజన్ సరఫరాలో లోపాలను గుర్తించడంతో పాటు సవరణ చర్యలను చేపట్టాలన్నారు. వీటిని రెండు నెలల పాటు ఎనిమిది ప్రభుత్వాసుపత్రుల్లో అమలు చేసి అక్టోబరు 15లోగా సమగ్ర నివేదిక ఇవ్వాలన్నారు. తద్వారా ఎల్ఎంవో డిమాండ్, సరఫరాలోని వ్యత్యాసాన్ని గుర్తించి ఆక్సిజన్ కొనుగోళ్ల ఖర్చును వీలైనంత వరకు తగ్గించవచ్చన్నారు. కోవిడ్ - 19 తీవ్రంగా ఉన్న 2020-21, 2021-22 సంవత్సరాల్లో రూ. 965.43 కోట్ల మేర బోధనాసుపత్రుల్లో ఎల్ఎంవో కొనుగోలు చేశారని చెప్పారు. అంతకుముందు 2016-20 మధ్య కేవలం రూ. 60.51 కోట్లు వ్యయం చేశారని, కొవిడ్ తర్వాత 2022-26 మధ్య నాలుగేళ్ల కాలంలో ఎల్ఎంవో కొనుగోలుకు రూ. 180.82 కోట్లు వ్యయమైందని మంత్రి చెప్పారు. గత నాలుగేళ్లలో కొత్త బోధనాసుపత్రులు, కొత్త ఆసుపత్రులు రావడం, పడకలు పెరగడం కొనుగోళ్లలో పెరుగుదలకు కొంత మేరకు కారణమైనప్పటికీ



అధికారులు చెప్పిన ఆక్సిజన్ డిమాండ్, వాస్తవ సరఫరాకు మధ్య భారీ అంతరం కనిపిస్తోందని అన్నారు. వీటి పరిశీలనకు అనంతపురం, గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం బోధనాసుపత్రులతో పాటు రెండు జిల్లా, రెండు ఏరియా ఆసుపత్రులను ఎంపిక చేయాలని ఆదేశించారు. పాత్ సంస్థ ఈ అధ్యయనాన్ని చేపడుతుందన్నారు.162 పీఎస్‌ఏ ప్లాంట్లలో 161 నిరుపయోగం..కొవిడ్-19 నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ సాయంతో డీఎంఈ పరిధిలో 62 ఆసుపత్రుల్లో, సెకండరీ హెల్త్ పరిధిలో 100 పీఎస్‌ఏ ప్లాంట్లను ఏర్పాటు చేశారని అధికారులు వివరించారు. అయితే ఈ ప్లాంట్ల ద్వారా తయారయ్యే ఆక్సిజన్ ప్యూరిటీ నిర్వహణ, నియంత్రణకు తగిన సాంకేతిక సిబ్బందిని నియమించలేదన్నారు. ఐసీయూ, సాధారణ వార్డులకు ఆక్సిజన్ సరఫరాకు సంబంధించిన నాణ్యతతో నిమిత్తం లేకుండా ఒకే పైపులైన్ వ్యవస్థ ఉండడం వంటి వివిధ కారణాల వల్ల 162 పీఎస్‌ఏ ప్లాంట్లకు 161 ప్లాంట్లు నిరుపయోగంగా మారాయని చెప్పారు.